# మనస్సు! ప్చ్

నిజంగా, నిండుగా నవ్వేవారిని చేస్తే నాకు భయం – ముఖ్యంగా స్త్రీ. చిరునవ్వు వెనక పెద్ద భవిష్యత్తుని దాచుకో గలగడం భగవంతుడు వారికి ప్రత్యేకంగా యిచ్చిన వరం.

ఎప్పుడయినా స్త్రీ నిన్ను సూటిగా చూసిందా వెంటనే జాగ్రత్త పడు. మర్నాడు నిన్ను చూసి నవ్వుతుంది. మూడో రోజు పలకరిస్తుంది. ఓ రోజు ఎవ్వరూ చూడనితోవ వెంటవచ్చి నీ భుజం మీద చెయ్యేస్తుంది. అంతే! అక్కడితో నీ అధ్యాయం సరి.

–పదేళ్ళ కిందట తాను రాసిన వాక్యం ఆనాడు అర్ధరాత్రి వెన్నెల మధ్య ఒళ్ళు జివ్వుమనే క్షణాన గుర్తుకొచ్చింది నీలకంఠానికి.

ఇంకా భోగన్‌విల్లా అవతల గదిలో నవ్వు గుండెల్ని చీలుస్తోంది–

ఎంత నిబ్బరం విక్టోరియాకి ?

చల్లగాలి పుండురేపినట్లు ఆలోచనల్ని కొరుకుతోంది. "తనది కాని వస్తువు గురించి తనెందుకు బాధపడాలి?" అన్న ఆలోచన ఈర్ష్యా జుగుప్సల మధ్య నలిగిపోతోంది– కిందటి క్షణం తనది కాకూడదా అన్న తపన. ఏవో సృష్టిశక్తులు తిరుగుబాటు చేసినప్పటి వణుకు.

ఏదో పురుగు మీదపడి ఎగిరింది – తృళ్ళిపడ్డాడు.

మధ్యాహ్నం తన పిరికితనం చూసి ఆమె నవ్విన నవ్వు ఇంకా గుండె కోస్తోంది.

అంత విశాలత్వం, అంత పెరుగుదల మనిషిలో సాధ్యమని ఊహించలేని నీలకంఠం ఆమె నవ్వుమత్తులో, ఆ అందం మంటల్లో భస్మీపటలయమేడు – ఆగదిలో తను కాకూడదా అనుకుంటే ఇప్పుడెలా?

ఇహ ఆలోచించలేకపోయాడు. దూరాన వేణు రావడం కనిపించి గుండె ఝుళ్ళుమంది.

"ఏరా? ఇక్కడే ఉన్నావు? ఈ చల్లగాలిలో-" అంటే -

అంతరాంతరాల్లో వణికాడు నీలకంఠం. ఉధృతంగా లేచివీచిన గాలికి పువ్వు తెగింది-

బలహీనంగా లేచిన పువ్వుల పరిమళం తోటని పట్టుకు పచార్లు చేస్తోంది.

"ఎంత బావుందో చూడు!" అని ఆకాశం వేపు తల తిప్పాడు. విసురుగా అరిచాడు వేణు.

"నువ్వు చూడకపోతే ఆకాశానికేం బాధలేదు కాని నీ వొళ్ళు ... లే"

లోపలికి వెళ్ళిపోతాడేమోనని భయమేసింది.

గదిలోపలి వ్యక్తిమీద ఎంత అయిష్టత ఉన్నా, స్త్రీత్వం ఉద్వేగం మీద ఎంత నమ్మకం లేకపోయినా, ఆ చపలత ఎంత అసహ్యమయినా విక్టోరియా మీద అంత పగ తీర్చుకోవాలనిపించలేదు నీలకంఠానికి.

రేపు తన వేపు గ్రంథాలు మాట్లాడే కళ్ళని తిప్పుతుంది -

"ఏమీ చేతకాని నువ్వు, నా కోరికమీద ఈ విధంగా పగతీర్చుకొన్నావు. ఇంత ఇరుకా నీ మనస్సు!" అని ప్రచ్ఛిస్తాయి కళ్ళు.

ఇంక తనకు మార్గమెక్కడ?

"అలా నడిచిరావాలి. ఒక విషయం చెప్పాలి నీతో - కాదనకు"

విచిత్రంగా బెరుకు మధ్య మెత్తబడిన ఆతని ముఖాన్ని చూశాడు వేణు.

"ఇప్పుడెందుకు? - ఉదయం ... ...."

"కాదు ఇప్పుడే నామాట వినవ్?"

నివ్వెరపోయినా - తమాయించుకు నడిచాడు నీలకంఠం వెనుక.

-పూర్తిగా అలంకరించుకొని అభిసారిక పాతసోయగంలా ఉంది రాత్రి వెన్నెల.

ఆకు కదిల్తే భయమేస్తోంది వేణు వెనక్కు తిరిగిపోతాడేమోనని.

తీసుకువచ్చాడే కాని ఏం చెప్పాలో తోచలేదు.

నది చివరంతా వెన్నెల వెండి చారలా కన్పిస్తోంది. తెలుపు పుక్కిలించినట్టు తీరాన ఇసుకా, ఎవరో సంచితం చేసిన పాపాల విశాల స్థూపంలాగు కన్పిస్తున్న జువ్విచెట్టూ-

భయమేస్తే - "ఇక్కడ కూచోకేం. అలా నడుద్దాం పద" అన్నాడు నీలకంఠం.

"ఏం చెప్పాలని పిలిచావు?"

"అదంతా మరిచిపో"

"అదేమిటి?"

"ఈ రాత్రిని చూస్తూ అన్నీ మరిచిపోలేవూ నువ్వు?"

"నీకు పిచ్చెక్కింది"

"పిచ్చికాదు. ఇవాళ నిన్నో ప్రళయం నుంచి తప్పించాలనుకున్నాను. మరి నన్నింకేం ప్రశ్నించకు. నే చెప్పేవరకూ తిరుగు."

ఒకోరాయి నీటిలో వేస్తూ కూచున్నాడు.

"ఎలా ఉంటోంది నీతో విక్టోరియా?"

ఎంతో సేపటికి అడిగితే నివ్వెరపోయాడు వేణు.

"ఆ ప్రశ్న వచ్చిందేం ఇప్పుడు?"

"చెప్పు"

లేచి – నీళ్ళల్లోకి కాళ్ళు వేళ్ళాడేసి కూచున్నాడు "బాగానే ఉంటుంది."

ఏదో చెప్పాలనుకుని, ఏమీ చెప్పలేకపోతున్నాడు నీలకంఠం. పెద్ద ప్రళయాన్ని ఎదుర్కో-గల స్థయిర్యం ఇవ్వగలనా అన్న ఆలోచన. ముఖ్యంగా స్త్రీ గురించి – అందులోనూ విక్టోరియా. అయిదేళ్ళ క్రితం ఆమె వ్యక్తిత్వానికి సరైన అర్థం ఇవ్వలేక దూరంగా తను పారిపోయొచ్చిన విక్టోరియా.

ఆ నల్లటి కళ్లలో ఆకలికి భయపడి ఎక్కడో తలదాచుకున్నాడు. రెండేళ్ళ తర్వాత – వేణూ దగ్గర్నుంచి శుభలేఖ వస్తే దిమ్మెరపోయాడు విక్టోరియా పేరు చూసి. "వద్దు" అని రాయలేకపోయాడు. నా కష్టాలకీ, చాలా అసంగతాలకీ జవాబు ఆమెలో దొరికింది. "జీవితానికిది కొత్త అధ్యాయం" అని వేణూ ఉత్తరం రాస్తే చేసేదిలేక శుభాకాంక్షలు పంపి, బీచికిపోయి నిద్రపోయొచ్చాడు. పెళ్ళికి వెళ్ళడానికి భయం. ఆ కళ్ళు, నవ్వూ చూడగలడా తను? – అమ్మో!

"ఏమిట్రా ఆలోచిస్తున్నావు?" అని నీలకంఠం అడిగితే.

"నువ్వు ఏం ఆలోచిస్తున్నావో చెప్పు" అన్నాడు.

"నీ గురించి. ఎప్పుడయినా పెద్ద కష్టమొస్తే నాకు ఉత్తరం రాయి" –

"నేనేం ఆలోచిస్తున్నానో తెలుసా? – విక్టోరియా గురించి. ఓ పెద్ద పాలరాతి విగ్రహం కట్టించి, కోరికకి చిహ్నంగా ఉంచాలి." బిగ్గరగా నవ్వేడు.

దూరాన కొండడు కన్పించేసరికి ఇద్దరూ తృళ్ళిపడ్డారు.

"ఏం?" అని వేణూ పలకరించాడు.

"ఊరు నుంచి ఎప్పుడొచ్చారు బాబూ?"

"ఇందాకనే, ఇంటికి వెళ్తున్నావా?"

తలూపి వెళ్ళిపోయేడు.

గాలిజోరు తగ్గి సముదాయింపుగా ఉంది –

స్థిమితపడి "తొందరగా పోదాం పద" అన్నాడు నీలకంఠం.

* * * * *

మునిమాపువేళకి బద్ధకంగా కళ్ళిప్పితే కిటికీ దగ్గర విక్టోరియా కనిపించింది –

"బాగా నిద్రపోవడం కూడా అలవాటు చేసుకున్నావే! పెళ్ళయిందంటే చాలా మారావనుకున్నాను" అంది నిబ్బరంగా.

"వాడేడీ?" అంటే.

"ఏం? నిన్నెత్తుకు పోతానని భయమా! ఊరుకి వెళ్ళారు. రేపు వస్తారనుకుంటాను. కాఫీ కావాలా?"

లేచాడు. సాయంకాలం ఆకాశం వెలుగుని స్తిమితంగా మింగుతోంది. అజంతా విగ్రహం వయ్యారంగా వెలిగే దీపాన్ని మోస్తోంది.

"పిల్లలా?"

విచిత్రంగా చూశాడు. "నాకా నీకా"

"అబ్బో మాటలు కూడాను" – కిటికీ బార్లా తీసి ఆవలిస్తూ మొగం కప్పుకొంది.

"ఎందుకూ?"

"నిన్ను చూడడానికి. అపాయంలో ఇరుక్కుంటున్న మీ స్నేహితుణ్ని రక్షించడానికి."

"అంతేనా?"

మంచంమీదకి వచ్చి కూచొంది. చెయ్యి కదిపితే ఆమె భుజం ఆనేట్టుంది.

కాస్సేపటికి "వయస్సు గడిచినా నువ్వేం మారలేదు" అంది.

"బుద్ధిగా బ్రతుకుతున్నావా?" అన్నాడు లేచి.

కోపం వచ్చింది. లేచి అతని భుజం పట్టుకు ఆపింది. "ఎవరికి బుద్ధి? నాకా? ఆయనకా? నీకు బ్రతకటం కూడా తెలిసినట్టు"

ఇక మాట్లాడడానికి విసుగేసి బయటికి వచ్చేశాడు. వరండాలో నౌకరు భోజనం ఏర్పాటు చేశాడు టేబులు తెచ్చి.

బంగళా చుట్టూ క్రీపర్లూ, క్రోటన్సూ, జినియా పువ్వులూ ఉన్మత్తతతో తల విరియబోసుకున్న స్త్రీలాగ భోగన్ విల్లా – సుఖానికి పరాకాష్టలా ఉంది.

అతను భోజనం చేస్తున్నంతసేపూ, పిట్టగోడని ఆనుకుని దూరంగా చెట్ల మధ్య కూర్చొంది విక్టోరియా చూస్తూ.

"నిజం చెప్పు, నా గురించి నువ్వెప్పుడూ ఆలోచించలేదూ ఇన్నాళ్ళూ!"

ఒక్కొక్కమాటా మనస్సును ఒరుసుకొంటోంది. ఆ ప్రశ్నలకు జవాబివ్వకూడదని బాగా తెల్సు నీలకంఠానికి – పరిధుల్లేని ఆవేశాల పుట్ట విక్టోరియా. అవకాశం ఇచ్చావా లోకం మరిచిపోతావ్. కాని ఆ అనుభవం పాతబడి, పేలవమయిందతనికి. అందుకని జవాబియ్యలేదు. కనీసం తలయినా ఎత్తలేదు.

అభిమానం గాయపడి, మనస్సులో ఎక్కడో ఉదాసీనత చివుక్కుమనిపించింది విక్టోరియాకి.

"తలెత్తడానికే పిరికితనం కాబోలు పాపం. ఎంత చచ్చిపోయావు నువ్వు! ఇంకా

నీకంటె ఈ తోటమాలి కాస్త నయం. గుంజి, బల్లెంతో పొడిచి, పలకరిస్తేగాని నీలో చలనం రాదు" ఆకు విరిచి లేచింది.

"మేడ మీద నిద్రపోతారా? అని అమ్మగారు అడుగుతున్నారు" అన్నాడు నౌకరు వచ్చి.

"వసారా చాలు" అని తోటలోకి వచ్చి కూచొన్నాడు.

కాస్సేపటికి విక్టోరియా వచ్చి "నా మీద అలిగావా? నీ పాతివ్రత్యానికి భంగం లేదులే. మేడమీదికి వెళ్ళి పడుకో" అంది.

దిగ్భ్రమతో ఇటు తలతిప్పితే నవ్వింది – "ఎందుకలా ఆకలిగా చూస్తావ్! ఎంత నిర్లక్ష్యంగా ఉండాలన్నా నీ మొహం ఒప్పుకోదు. నువ్వెందుకూ నాకు? – పోయి పడుకో" అని వెళ్ళిపోయింది.

కడుపులోంచి కెలికినట్టయింది. విక్టోరియా పూర్తిగా బాగుపడిందన్న ఆలోచనకి మనస్సులో ఎక్కడా పొత్తు కుదరడంలేదు. ఇంకా ఆ అల్లరి, మాటల్లో కత్తులూ, అప్పటినవ్వూ, కళ్ళూ అలాగే ఉన్నాయి. మరి పదేళ్ళయినా ఆ మత్తుతో, ఆ బిగువుతో విక్టోరియా బ్రతగ్గలదు. కాని, ఇదేమిటి? ఇప్పుడు కన్పించేదంతా విక్టోరియా మనస్సేదే అయితే రెండేళ్ళ క్రిందట తన అనుమానాలకి తనకే సిగ్గేసింది.

అనుమానాల్తో ఒక్కోసారి మానవుడు తనని తానే హత్యచేసుకుంటాడు. ఆలోచనలకి బందీ అయి భవిష్యత్తుని వర్తమానానికి అమ్మేసుకొంటాడు.

చీకటి మధ్య చెట్లలోంచి ఏదో పిట్ట కేరుమంది.

మధ్యాహ్నం నుంచే ఏదో అసంతృప్తిగా ఉంది. విక్టోరియా అందం తనని మళ్లీ రెచ్చగొడుతోందేమో? 'ఆ అందానికి అర్థంలేదు' అని తన మనస్సుని తాను సముదాయించుకో జూశాడు. కాని అందంకాదు. ఇంకా ఏదో? తనకే అందని ఆలోచన ... అదీ ...

తోట మధ్య సిమెంటు బెంచీ మరీ చల్లగా ఉంది.

కూర్చొన్న కొద్ది క్షణాలకి ఆలోచనకు జవాబు దొరికింది.

ఇదీ విషయం ... !

ఒక్కసారిగా విక్టోరియా మంచితనాన్ని మనస్సు అంగీకరించడం లేదు.

"విక్టోరియాలో పాత బలహీనతలున్నాయి. ఎన్నో పాపాల సమిష్టి రూపం ఆమె" అని నిర్ధారణ అయితే తన మనస్సుకి తృప్తి. విచిత్రమైంది మనస్సు. ఒక్కొక్కప్పుడు 'చెడు'లోంచి శాంతిని వెదుక్కొంటుంది.

బంగళా అంతా నిశ్శబ్దంగా ఉంది. ఇంకా విక్టోరియా గదిలో దీపం వెలుగుతూనే ఉంది. ఏదో పురుగు చప్పుడు చేస్తూ చుట్టూ తిరుగుతోంది. విసుగేసి లేచాడు. మేడమీదికి నడవబోతే, ఆమె గదిలోంచి నవ్వు వినిపించింది.

నరాలన్నీ జివ్వుమన్నాయి. గుండె ఒక 'బీట్' వదిలింది. కాల చక్రం నిలిచింది.

కిటికీలోంచి విక్టోరియా ముఖం తెలుస్తోంది. కాని ఆ పక్కన ... పక్కన ... ఎవరో గుర్తు తెలీడంలేదు. నల్లగా, బొద్దుగా అసహ్యంగా.

కామానికీ, అభిరుచికీ పొంతనలేదు – అభిరుచికి భిన్నమైన పనులు చాలా కామం చేతిలో ఉన్నాయి.

రక్తం వేగంగా మెదడుకు పాకుతోంది. అంత విచిత్రాన్ని మనస్సు ఆకట్టలేక పోతోంది.

"ఇంతపని సాధ్యమా?" అన్న దిగ్భ్రమ. త్వరత్వరగా కిందికి దిగి వచ్చేశాడు.

ఇన్ని ఆశ్చర్యాల వెనక ఒక్క ఆటవిడుపు కన్పించింది. ఆమె పాత విక్టోరియా! – తన ఆలోచనలో పొరపాటు లేదు – ఎంత హాయి మనస్సుకి?

అంతలో వేణూ గుర్తుకొస్తే గుండె కలుక్కుమంది. ఈమెతో వాడు ఎలా? ఆలోచిస్తూ కూచొన్నాడు.

–నది నుంచి వేణూతో తిరిగివస్తూంటే కొండడు కన్పించేసరికి నీలకంఠానికి బుర్రెల్లుకమ్మాయి. తన కళ్ళు తనకి మోసం చెయ్యకపోయి, ఇంకా జ్ఞాపకశక్తి నశించకపోతే– ఇతనే – ఇతన్నే తనాగదిలో చూసింది ....

అబ్బ! విక్టోరియా! ........

* * * * *

పాము కుబుసంలాంటి తెల్లటి చీరెకట్టుకుని కాఫీలు తెచ్చింది పొద్దుటే. వేణూ అప్పుడే మొహం కడుక్కొని సిగరెట్టు వెలిగించాడు.

కాఫీ ఇస్తూ భర్తతో "ఈయనంత పిరికివాణ్ణి నేనెక్కడా చూడలేదండి. మీరు ఇంట్లో లేరనేసరికి తోటదాటి లోపలికి వస్తే ఒట్టు. రాత్రంతా ఆ తోటలోనే, చలిలో .... మీరు రాత్రెప్పుడొచ్చారు?" అంది.

వేణూ ఒకటే నవ్వు.

"వాడంతేలే! ఆడదానిమీద వాడికి నమ్మకం తక్కువ. అందులోనూ నీ నవ్వును చూసి భయపడ్డాడంటే తప్పులేదు."

"ఏమండీ? అంతేనా" అని పలకరిస్తోంది. తనులేచి పిట్టగోడ దగ్గరికి వచ్చేశాడు ముఖంలో ఉద్వేగాన్ని దాచుకోలేక.

అంత గుండెలు తీసినట్టు మాట్లాడుతుందేం? ఈ పరిహాసానికి అర్థం లేదు. వాళ్ళిద్దరి నవ్వూ మరీ భయపెట్టోంది.

వెనక్కి తిరిగితే విక్టోరియా ఒక్కతే కన్పించింది. వేణూ లోపలికి వెళ్ళాడు.

తెల్లగా పల్చటి చీరె. తెల్లటి బ్లౌజు–మల్లెపువ్వులా, స్వచ్ఛతకి చిహ్నంలా ఉంది.

"ఎందుకండీ అంత భయపడతారు నన్ను చూసి?" అంది గౌరవాన్ని పెంచుతూ.

"నీ పనులు మరీ బాగుండలేదు విక్టోరియా! వాడు చూస్తే?'

"ఏమిటి?" అంది విస్తుపోతూ.

"రాత్రంతా ఏమిటి? ఆ నౌకరుతో, ఛీ!..."

పకాలున నవ్వేసింది. సిగ్గుతో కుచించుకుపోయి, కన్నీళ్ళు తిప్పుకు ఏడుస్తుందను కున్నాడు. కాని నవ్వేసరికి నిర్విణ్ణుడయ్యాడు.

కాటు వెయ్యాల్సిన పాము మెలికలు తిరిగి, చుట్టుకుపడుకుంటే ఎలా ఉంటుంది?

వేణూ వస్తే –

"ఏమండోయ్ చూశారా? ఈయనేమంటున్నారో?"

చెప్తుందేమోనని వణికిపోయాడు.

"చెప్పనా?" అంటోంది.

"... ... ..."

"నామీద ఈయనకి బొత్తిగా నమ్మకంలేదు. నయం. చేతనయితే నన్ను జైలుకి పంపేవారే. పోనీలెండి. వేణ్ణీళ్ళు స్నానం చేస్తారా?" అంటూ లోపలికి వెళ్ళింది.

"ఏమిట్రా ఆలోచిస్తున్నావ్? విక్టోరియా గురించేనా?" అన్నాడు వేణూ దగ్గరికి వచ్చి.

"ఎందుకు పెళ్ళి చేసుకున్నావ్ విక్టోరియాని?"

"అదేమిటి?"

"చెప్పు ముందు"

నవ్వేడు వేణు. భుజం మీద చెయ్యేసి "రంగు రంగుల బంగళా, క్రోటన్లూ, భోగన్ విల్లా, కాఫీ, బొచ్చు కుక్కా, మంచి సినీమా ఎలా కావాలో అలాగే ఓ మంచి భార్య కావాలనిపించింది. ఇరవయ్యో శతాబ్దపు బ్రతుక్కి భార్య ముగింపు. అందుకని తెచ్చుకున్నాను విక్టోరియాని. ఓ పిచ్చుకలాగు, సీతాకోక చిలుకలాగు పెంచుకొంటున్నాను. అలా మాట్లాడుతూ, తిరుగుతూ ఉంటే నీకు సంతోషంగా ఉండదూ. అదిగో వస్తోంది వూరుకో" అన్నాడు.

ఎందుకో నీలకంఠం మనస్సు గాయపడింది. అతను ఊహించిన దానికి వ్యతిరేకంగా ప్రపంచం పరిగెత్తిపోయింది. ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న మల్లెపందిరిమీద తుఫానుగాలి సోకినట్టు పొందికగా ఉన్న మనస్సు కదిలింది. వేణూ పొందే ఆటవిడుపుని పూర్తిగా అర్థం చేసుకోలేక పోయాడు. మనస్సులో ఏదో దాచుకుని హుందాకి పైకి అలా చేస్తున్నాడేమో. మనస్సులో ఎన్ని ప్రళయాలున్నాయో! అలా అనుకొని తృప్తి పడుతోంది మనస్సు. నిజంగా ఉన్నాయని తెలిస్తే ఎంత హాయి మనస్సుకి.

మనస్సు – ప్చ్

రైలు దగ్గర ఆ విషయం మళ్లీ ఎత్తాడు నీలకంఠం.

నవ్వేసి పూరుకొన్నాడు వేణు.

ఏదో చెప్పాలనుకుని ఉబలాట పడుతోంది మనస్సు. ఇక దాచుకోలేక కక్కేశాడు–

"నీకు తెల్సునో లేదో – విక్టోరియా, ఆ కొండడితో"

ఓ క్షణం మతి పోయినట్టు చూశాడు వేణు, అంతలో చిరునవ్వు నవ్వేశాడు.

"నీకూ తెల్సిందా! అందంతా పాత కథలే!" నవ్వుతున్నాడు.

"నీకిదివరకే తెల్సా!"

"ఊఁ"

నీలకంఠం ఆశ్చర్యానికి అంతులేదు – గార్డు విజిల్ వేస్తున్నాడు. "ఎలా బ్రతుకుతున్నావురా అటువంటి మనిషితో?"

"నీకు తెలీదు. విక్టోరియా అన్న మనిషి కావాలి నాకు" నవ్వాడు. ఇంకా నీలకంఠం దిమ్మరపోవడం చూసి "అర్థం కాదులే ఇది .... నాలాగ బ్రతకడానికి నువ్వు పదేళ్ళు ప్రయత్నించాలి. బహుశా జీవితమంతానేమో. నాకేం బాధల్లేవులే. ఉత్తరం రాస్తూండు."

రైలు కదిలింది –

వేణూ చెయ్యి దూరం నుంచి తెలుస్తోంది.

ఏదో చెయ్యడానికి వచ్చి మనస్సుని గాయపరుచుకు పోతున్నాడు నీలకంఠం. ఆ బడబానలం లోంచి అమృతం తెచ్చుకోవడం సాధ్యమా అన్నది తెగని ప్రశ్న. ఇన్నీ తెలిసి వేణూ హాయిగా ఉంటున్నాడంటే ఏదో అపూర్వ శక్తి అతణ్ణి నిత్యం జోకొడుతుండాలి–

విక్టోరియా, వేణూ, కొండడు – అతన్ని చూసి దూరం నుంచి నవ్వుతున్నారు.

మళ్ళీ ఎక్కడో మనస్సులో అలజడి రేగింది. స్నేహితుడు సుఖంగా ఉంటున్నాడన్న తృప్తి కంటె, అయిదేళ్ళ క్రితం తను వదలకూడని వస్తువుని వదులుకున్నాడేమో నన్న సంశయం మళ్ళా పీకుతోంది.

విక్టోరియా!....

* * * * *

భగవాన్! – అన్నీ ఇచ్చావు మాకు – సుఖాన్ని, తృప్తిని, శాంతినీ, చివరికి స్త్రీని – అన్నిటినీను, కాని, ఈ మనస్సును ఎందుకు మిగిల్చావు? అంటే దేవుడు అన్నాడు!

"మనస్సు! – ప్చ్"